www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 7 ఏప్రిల్ 2023



హిందీ పరీక్షకు 146 మంది గైర్హాజర్

ప్రజాశక్తి-కడప అర్బన్

పదవ తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా హిందీ పరీక్ష గురువారం ప్రశాంతంగా ముగిసింది. 27,228 విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 27,142 మంది హాజరయ్యారు. 146 మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి డిబార్లు నమోదు కాలేదు. ఫ్లయింగ్ స్క్వాడ్ 55, డిఇఒ 10, పరిశీలకులు 2 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను పోలీసులు మూయించి వేశారు. జిరాక్స్ మాస్ కాపీలకు పాల్పడకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులు విద్యాశాఖ పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసింది.

వైభవంగా రథోత్సవం



ఊరేగిన కల్యాణ కోదండరాముడు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామివారి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు గురువారం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన రథోత్సవం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. శ్రీ సీతాలక్ష్మణ సమేత కోదండరామ మూలవారు రథాన్ని అధిష్టించి గ్రామవీధుల్లో విహరించారు. భజన బృందాల చెక్కభజనలు, కోలాటాలు చేస్తుండగా భక్తులు రథాన్ని లాగారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు అందించారు. ఆత్మ రథికుడు, శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు, విషయాలే వీధులు. ఈ రీతిలో శరీరాన్ని రథంతో పోల్చడంతో స్థూల శరీరం వేరని, ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మజ్ఞాన వివేకం కలుగుతుంది. రథోత్సవంలో ముఖ్యంగా కలిగే తత్త్వజ్ఞానమిదే. కార్యక్రమంలో డెప్యూటీ ఇఒ నటేష్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ, ఇంజనీరింగ్ అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పత్తి రైతు దిగాలు

- తగ్గిన దిగుబడి, ధరలతో విలవిల
- గతేడాది క్వింటా ధర రూ.10 వేలు
- ప్రస్తుతం రూ.6 వేలకే పరిమితం
- దళారుల బెడద - ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-చాపాడు

ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్లకు తోడు అంతర్జాతీయ మార్కెట్లో ధరల హెచ్చుతగ్గుల కారణంగా పత్తి ధరలు పడుతూ.. లేస్తూ ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు పత్తిని అమ్మేందుకు ఊగిసలాడుతున్నారు. గత ఏడాదితో పోల్చితే ధరలు భారీగా తగ్గాయి. ప్రస్తుతం మార్కెట్లో క్వింటా పత్తి ధర రూ.ఆరు వేలు పలుకుతోంది. ఖరీఫ్‌లో సాగైన పత్తి పంట వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట సాగు సమయంలో ఆశాజనకంగా ఉన్నప్పటికీ తరువాత వర్షాలకు పంట దెబ్బతినడంతో దిగుబడి తగ్గుముఖం పట్టింది. దిగుబడితో పాటు ధరలు అమాంతం తగ్గాయి. ఎకరాకు మూడు క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడి వస్తోంది. గత ఏడాది పత్తి పంటకు గిట్టుబాటు ధర ఉండటంతో ఎక్కువ మంది రైతులు పంట సాగు చేపట్టారు. కిలో పత్తి ధర ప్రారంభంలో రూ.85 నుంచి రూ.90ల వరకు పలికింది. ప్రస్తుతం రూ.60కు తగ్గింది. గత ఏడాది క్రితం సిసిఐ రూ.95కి కొనుగోలు చేసింది. ఈ ఏడాది దిగుబడి చేతికి అంది వచ్చిన తర్వాత అనంతరం రూ.60 నుంచి రూ.65కు చేరింది. గతంలో దిగుబడి ఆశాజనకంగా లేని సమయంలో క్వింటా రూ.105 వరకు పలికింది. ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరకు కూడా పత్తి రైతులు నోచుకోవడంలేదు. రైతులకు వేర్వేరు కారణాలు చూపి దళారీలు మభ్యపెట్టేస్తూ, నాణ్యత, రంగు లేదని సాకులు చూపుతూ తక్కువ ధర నిర్ణయిస్తున్నారు. దళారీలు పత్తి రైతు వద్ద తక్కువ ధరలకు సేకరించి పత్తిని ప్రొద్దుటూరు, గుంటూరు, నంద్యాల, తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ మిల్లులలో అమ్ముకుంటూ అధిక ధరలు సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామాలలో తూకాలు వేసే సందర్భంలో కూడా చాలావరకు మోసాలకు పాల్పడుతున్నప్పటికీ కట్టడి చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. ధరలు తగ్గడంతో పత్తి కోసం వ్యాపారులు గ్రామాల బాట పట్టిన రైతులు అమ్మకాలకు విముఖత చూపుతున్నారు.



మండలంలో సాగులో ఉన్న పత్తి పంట

తెగుళ్లతో తగ్గిన దిగుబడి



ఎకరా పొలాన్ని కౌలుకు తీసుకొని పత్తి పంటను సాగు చేపట్టాను. పంట సాగు చేసినప్పట్టి నుంచి తెగుళ్ల బెడద అధికంగా ఉంది. అధికంగా పురుగు మందులు వాడాల్సి వచ్చింది. ప్రస్తుతం పంట చేతికి వచ్చిన తరువాత ధరలు అమాంతం తగ్గాయి. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకోవాలి.

- లక్ష్మిరెడ్డి, కౌలు రైతు, తిప్పాయపల్లె, ఖాజీపేట మండలం.

పత్తి పంట సాగుతో నష్టపోయాం



ఏడు ఎకరాలలో పత్తి పంటను సాగు చేపట్టాం. ఎకరాకు రూ.30 వేల వరకు సాగు ఖర్చులు అయ్యాయి. దిగుబడి చూస్తే ఎకరాకు 3 క్వింటాళ్ల వరకు మాత్రమే వచ్చినది. క్వింటా ధర రూ.6200 మాత్రమే పలికినది. ఎకరాకు రూ.పది వేల వరకు నష్టం వచ్చింది. గత ఏడాది పత్తి పంటకు ఉన్న ధరలను చూసి పంట సాగు చేపట్టడంతో నష్టపోవాల్సి వచ్చింది.

- మస్తాన్ యాదవ్, పత్తి రైతు చాపాడు.

అధిక వర్షాలతో తగ్గిన పత్తి దిగుబడి

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పత్తి పంట అధిక వర్షాలకు దిగుబడి తగ్గింది. రైతులకు వర్షపు నీటిని నిలువ ఉండకుండా తొలగించుకోవాలని అవగాహన కల్పించాం. రైతులు పలు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ అయినప్పటికీ దిగుబడి తగ్గింది. మైదుకూరు డివిజన్ పరిధిలో 3768 హెక్టార్లు పత్తి పంట సాగైనది. రాజుపాలెం మండలంలో అత్యధికంగా 3334 హెక్టార్లలో పత్తి పంట సాగుకాగా పంటకోత ప్రయోగాలలో 3 నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి వచ్చినది. పంట కోత ప్రయోగాల నివేదికలను ఉన్నత అధికారులకు పంపాము. పంటకోత ప్రయోగాల ఆధారంగా ఇన్సూరెన్స్ మంజూరు అయ్యే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు మాత్రం అమలయ్యేలా చేస్తున్నాం.



- కృష్ణమూర్తి, వ్యవసాయ శాఖ ఎడిఎ, మైదుకూరు డివిజన్.

87 మంది విఆర్‌ఒల ప్రొబేషన్ డిక్లరేషన్ పూర్తి

ప్రజాశక్తి-చాపాడు

జిల్లాలో 87 మంది విఆర్‌ఒల ప్రొబేషన్ డిక్లరేషన్ ఉత్తర్వులు కలెక్టర్ విజయ్‌రామరాజు గురువారం విడుదల చేశారు. రెండు సంవత్సరాల క్రితం ఉమ్మడి జిల్లాలోని 228 మంది విఆర్‌ఎలను విఆర్‌ఒలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రెండు సంవత్సరాల క్రితం అవకాశం కల్పించారు. విఆర్‌ఒలుగా విధులు నిర్వహిస్తూ ప్రొవిషన్ సి పరీక్షలు, డిపార్ట్మెంట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన 87 మందికి ప్రొబిషన్ డిక్లరేషన్ ఉత్తర్వులు విడుదల చేశారు. కడప జిల్లాలో 76 మంది, అన్నమయ్య జిల్లాలో 11 మంది ప్రొవిషన్ పూర్తయిన వారు ఉన్నారు. మిగిలిన వారు డిపార్ట్మెంటల్ పరీక్ష ఉత్తీర్ణత సాధించని కారణంగా వారి ప్రొబేషన్‌ను పెండింగ్‌లో అలాగే ఉంచారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-కడప



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సిసి విద్యార్థులు

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండ వచ్చని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. గురువారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఎన్‌సిసి విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్, ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ ఆర్.నీలయ్య ప్రారంభించారు. ప్రభుత్వ పురుషుల కళాశాల నుండి ప్రారంభమైన ర్యాలీ కలెక్టరేట్ మీదుగా సైనికుల సర్కిల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగనిరోధక శక్తిని బలోపేతం చేసుకోవడానికి మిల్లెట్లను ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో భాగంగా చేసుకోవాలన్నారు. పలు రకాల కేన్సర్ల నివారణకు కూడా ఉపకరిస్తాయని అన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఇన్ని ప్రయోజనాలను అందిస్తున్న వీటిని ఆహారంలో ఒక భాగంగా చేసుకుని తమ రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవడంతోపాటు ఆరోగ్య భారతావని రూపొందించడంలో భాగస్వాములు కావాలని అన్నారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ మహేష్, క్యాడెట్లు పాల్గొన్నారు. **కడప అర్బన్:** మనం తీసుకునే ఆహారపు అలవాటుని బట్టి మన ఆరోగ్యం ఉంటుందని న్యూరో సర్జన్ సాయికిరణ్ అన్నారు. గురువారం కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్ ఫర్ ఆల్ అనే అంశం ప్రపంచ ఆరోగ్య సంస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. మానవుని దైనందిన జీవితకాలంలో అనారోగ్యానికి గల కారణం మనం తీసుకునే ఆహారపు అలవాట్లపైనే, జీవిత ఆయుష్షు ముడిపడిందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్.మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి.ప్రేమ్ కుమార్, ఈసీఈ విభాగాధిపతులు డాక్టర్ జి.హేమలత హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతులు డాక్టర్ ఐ.శ్రీవాణి, ప్రోగ్రాం సమన్వయకర్త ఆనంద్ రావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు మారెమ్మ జాతర

కడప అర్బన్: ఆలంకానిపల్లెలోని శ్రీశ్రీ మారెమ్మ అమ్మవారి జాతర ఈ నెల 8, 9వ తేదీలలో నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తేదీ అమ్మవారికి పూజా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. 9వ తేదీ బండలాగుడి పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం

కడప: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కడప నగర శివారులోని చౌడమ్మ వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. న్యాయ విజ్ఞాన సదస్సులు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఎ సెక్రటరీ ఎస్.కవిత మాట్లాడుతూ ఏప్రిల్ 7న 'ప్రపంచ ఆరోగ్య దినోత్సవం' ప్రజలు మెరుగైన ఆరోగ్యంతో జీవించాలనేది ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ ఏడాది 'అందరికి ఆరోగ్యం' నినాదంతో 68వ ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ కు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వారికి షుగర్, బీపీ మరియు ఇతర వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా ఐరన్, క్యాల్షియం, ఓఆర్ఎస్ మొదలగు మందులను పంపిణీ చేయడం జరిగినది. కార్యక్రమంలో వైద్యాధికారి స్ఫూర్తి, వైద్య సిబ్బంది, వృద్ధాశ్రమం నిర్వాహకులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

అంగన్వాడీలకు నియామక పత్రాలు అందజేత

కడప: ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కడప అర్బన్ పరిధిలోని ఆరు అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించి జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా ఎంపికైన ఆరుగురు అంగన్వాడీ సహాయకులకు గురువారం ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా నియామక పత్రాలు అందజేశారు. నియామక పత్రాలు అందుకున్న వారిలో మరియాపురం-2 ఎం.గురువాణి, మారుతి నగర్-2 బి.రాణి, శాస్త్రి నగర్-1 ఎస్.కరిష్మా, ఎల్ఐసి కాలనీ డి.శ్రీవాణి, వికలాంగుల కాలనీ జి.వెంకటసుబ్బమ్మ, భగత్‌సింగ్‌నగర్ పి.జ్యోతి ఉన్నారు. ఈ సందర్భంగా అంజాద్‌బాషా మాట్లాడుతూ ఎంపికైన వారందరూ అంగన్వాడీ కేంద్రాలలో సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కడప అర్బన్ ప్రాజెక్టు సిడిపిఒ ఎస్.సునంద, కార్పొరేటర్లు బాలస్వామిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, త్యాగరాజు, రామచంద్రయ్య, శ్రీదేవి పాల్గొన్నారు.

'పది' తెలుగు ప్రశ్నపత్రం లీకేజీలో ఆరుగురు అరెస్టు

- మైదుకూరు డిఎస్‌పి వంశీధర్‌గౌడ్ వెల్లడి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలో పదవ తరగతి మొదటి పరీక్ష తెలుగు జవాబు పత్రం లీకేజీకి కారణమైన ఆరుగురిని అరెస్టు చేశామని మైదుకూరు డిఎస్‌పి వంశీధర్ గౌడ్, మైదుకూరు రూరల్ సిఐ నరేందర్‌రెడ్డి, ఎస్ఐ విద్యాసాగర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలోని అంబవరానికి చెందిన మేకల గంగాధర్ అనే వ్యక్తిని తెలుగు జవాబు పత్రం కేసులో అనుమానించి అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. విద్యుత్ ఆఫీస్‌లో లైన్‌ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తున్న రామిరెడ్డి ద్వారా తనకు జిరాక్స్ కాపీ వచ్చిందని గంగాధర్ చెప్పాడని పేర్కొన్నారు. తన చెల్లెలి కోసం ఒక కాపీ జిరాక్స్ ఇవ్వాలని గంగాధర్ స్నేహితుడైన సతీష్‌తో కలిసి వెళ్లి బి.మఠంలో ఉన్న జిరాక్స్ సెంటర్ వద్దకు వెళ్లి జిరాక్స్ కాపీలు తీసుకున్నారన్నారు. జిరాక్స్ సెంటర్ వద్ద ఉన్న ఓ టివి విలేకరి వీడియోతీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారన్నారు. గంగాధర్ చెప్పిన సమాచారం మేరకు రామిరెడ్డిని అదుపులో తీసుకొని విచారించగా తన కుమార్తె పదవ తరగతి పరీక్షలు రాస్తున్నడంతో దీప్తి స్కూల్లో పనిచేసే హిందీ ఉపాధ్యాయుడు నుంచి రెండు మైక్రో జిరాక్స్ తెలుగు జవాబు కాపీలను తీసుకున్నాడన్నారు. రామిరెడ్డి సమాచారం మేరకు స్కూల్ వద్దకు వెళ్లి ఫిజిక్స్ టీచర్ సుబ్రహ్మణ్యం, తెలుగు టీచర్ రామాంజనేయులు, హిందీ టీచర్ బాలరాజులు అదుపులో తీసుకుని విచారించామన్నారు. బి.కోడూరు మండలంలోని సగిలేరు గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు బాలచంద్రుడు ద్వారా తన సమీప బంధువు తెలుగు టీచర్ రామాంజనేయులకు వాట్సాప్ ద్వారా పంపారని పేర్కొన్నారు. ప్రశ్నపత్రాన్ని ఆ ముగ్గురు టీచర్లు దీప్తి హైస్కూల్ కరస్పాండెటర్ రమణారెడ్డికి తెలిపారు. రమణారెడ్డి సూచనల మేరకు ముగ్గురు టీచర్లు తెలుగు గైడ్‌లో నుంచి జవాబులు సేకరించి వాటిని మైక్రో జిరాక్స్ కాపీలను స్కూల్లోని ప్రింటర్ ద్వారా చేసి వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారని పేర్కొన్నారు. దీప్తి హైస్కూల్‌లోని కంప్యూటర్, జిరాక్స్ మిషన్‌ను, మూడు కాపీ పత్రాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. సగిలేరు గురుకుల పాఠశాల వద్దకు వెళ్లి విచారణ నిర్వహించామన్నారు. అక్కడ తెలుగు టీచర్ చంద్రబాబును విచారించామన్నారు. తమ స్కూలుకు సంబంధించి 62 మంది విద్యార్థులు పరీక్షలు బి.కోడూరు జడ్పీ హైస్కూల్లో పరీక్షలు రాస్తున్నడంతో రూమ్ నెంబర్-7లో ఉన్న తమ విద్యార్థి ద్వారా ప్రశ్నపత్రం తెల్లకాగితంలో రాసుకున్నామన్నారు. ప్రశ్నపత్రం లీకేజీ కేసులో మేకల గంగాధర్, గంగిరెడ్డి చిన్నరామిరెడ్డి, చిట్టిబోయిన బాలసుబ్రమణ్యం, వనిపెంట రామాంజనేయులు, సగిలి బాలరాజు, పొందిబోయిన చంద్రబాలుడును అరెస్టు చేశామని పేర్కొన్నారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి

తెలుగు భాషా వ్యాప్తికి కృషి

కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య ఆర్టీసీ చైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డిని తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సులలో తెలుగు భాషలో ఒక నీతి పద్యం తప్పనిసరిగా ఉండేలా కృషి చేయాలని కోరారు. అందుకు ఆర్టీసీ చైర్మన్ సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామన్నారు. ఈ ప్రక్రియలో సాహిత్య అభిమానులు, సాహితీకారుల సహకారం కూడా తప్పనిసరి అవుతుందన్నారు. తెలుగు భాష పురోగమనానికి, వ్యాప్తికి, తెలుగు భాషను భావితరాలకు అందించడం కోసం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎప్పుడు ముందుంటుందని, అధికార భాష సంఘంతో కలసి అందుకు అనుగుణమైన కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందించగలమని ఆయన తెలిపారు.

ఆర్థికాభివృద్ధి కోసం విరివిగా రుణాలు

కడప అర్బన్ : అందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కెనరా బ్యాంకు రుణాలు మంజూరు చేయడంలో ముందుటుందని కెనరా బ్యాంకు కడప రీజనల్ ఆఫీస్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మురళీ మోహన్, మూలవంక కెనరా బ్యాంకు మేనేజర్ తల్లం ప్రవీణ్ పేర్కొన్నారు. నగరానికి చెందినవారు యర్రవండ్ల దీపకి స్టాండ్ అప్ ఇండియా కింద కెనరా బ్యాంకు మూలవంక బ్రాంచ్ సహకారంతో కొనుగోలు చేసిన హైర్ బస్సును గురువారం మూలవంక కెనరా బ్యాంకు వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగస్తుల కోసం కెనరాబాంక్ కెనరా ప్రీమియమ్ పేరోల్ ప్యాకేజిని రుపొందించిందని తెలిపారు. ఈ ప్యాకేజిలో మినిమం బాలన్స్ అనే నిబంధనలు ఉండదని పేర్కొన్నారు. అకౌంట్‌కు ఇన్సూరెన్స్ సదుపాయం ఉచితంగా లభిస్తుందని చెప్పారు. ఎస్ఎంఎస్, నెఫ్ట్, ఐఎమ్‌బిఎస్‌లపై ఎలాంటి ఛార్జీలు వర్తించవని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది నారాయణ, బస్సు ఓనర్ దీప,కుటుంబ సభ్యులు సుబ్బరాయుడు, చరణ్ పాల్గొన్నారు.

కెఎస్ఆర్ఎం అధ్యాపకునికి పిహెచ్‌డి ప్రదానం



కడప అర్బన్ : కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగంలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న ఎ.చంద్ర ఓబుల్‌రెడ్డికి అనంతపురం జెఎన్‌టియు వారు పిహెచ్‌డి డిగ్రీని ప్రదానం చేశారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్.మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో అనంతపురం జెఎన్‌టి యులో సహా ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ కె.మాధవి పర్యవేక్షణలో పరిశోధన చేసి వలన జెఎన్‌టియు పిహెచ్‌డి పట్టాను ప్రదానం చేసిందని పేర్కొన్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పలు సెమినార్స్, వర్క్ షాప్స్, కాన్ఫరెన్స్‌లలో పరిశోధన పత్రాలను సమర్పించారని తెలిపారు. ఈ పిహెచ్‌డి డిగ్రీ పట్టాను పొందడం పట్ల కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి.ప్రేమ్ కుమార్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ వి.లోకేశ్వర్ రెడ్డి, వివిధ శాఖధిపతులు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

'ఫ్యామిలీ డాక్టరు'తో మెరుగైన వైద్యం : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్ రామరాజు

ప్రజాశక్తి-దువ్వూరు

వైద్య ఆరోగ్య రంగాన్ని మరింత పటిష్టం చేసే దిశగా, దేశం గర్వించదగ్గ బృహత్తర కార్యక్రమంగా రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌కు శ్రీకారం చుట్టిందని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. గురువారం ఫ్యామిలీ డాక్టర్ విధానం అనే మహోన్నత కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం, లింగంగుంట్ల గ్రామం నుండి పూర్తి స్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు అయ్యేలా లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా స్థాయి కార్యక్రమంగా దువ్వూరు మండలం ఎ.ఎస్.పల్లె హెల్త్‌అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో ఫ్యామిలీ డాక్టర్ విధానంను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మండలంలో రెండు పబ్లిక్ హెల్త్ సెంటర్లు ఉంటాయని, ప్రతీ సెంటర్లో ఇద్దరు క్వాలీఫైడ్ వైద్యులు, అవసర మైన సిబ్బందితో పాటు, మౌలిక సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వం కల్పిస్తుం దన్నారు. ప్రజలంతా ఫ్యామిలీ డాక్టర్ పథకం సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, సర్పంచ్ లు,వాలంటీర్లు ద్వారా ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ పథకం గురించి విస్తృత ప్రచారం చేపట్టి ప్రజల ఆరోగ్య భద్రతలో తమ వంతు సామాజిక బాధ్యతను నిర్వర్తించాలనికోరారు. ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి మాట్లాడుతూ గత అక్టోబర్ నుంచి ఫ్యామిలీ డాక్టరు విధానం ప్రజలకు ప్రయోగాత్మకంగా అందిస్తున్నప్పటికీ, పూర్తి స్థాయిలో నేటి నుంచి వైద్య సేవలు ప్రజల ముంగిటకు మన ప్రభుత్వం తీసుకురావడం అభినందనీయం అన్నారు. నాలుగేళ్లలో వైద్య, ఆరోగ్య రంగంలో అనేక సంస్క రణలు తీసుకొచ్చి, పేదవారి ఆరోగ్య భద్రత కోసం ఈ స్థాయిలో ఆలోచించిన ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి ఒక్కరే అన్నారు. ప్రతీ గ్రామంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ స్థాపించి, ఆయా సచివాలయాలకు అనుసంధానించడం ద్వారా పనిచే సేలా చర్యలు తీసుకున్నారని వివరించారు. దీర్ఘకాలిక వ్యాధులతో భాదపడుతున్న వారికి పెన్షన్ అందించి వారికి ఆర్థిక భరోసాను కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, జడ్‌టిసి కృష్ణయ్య, ఎంపిపి జయచంద్రారెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, స్థానిక వైద్యాధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధా

మహిళల అభివృద్ధికి పెద్దపీట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కాశినాయన

రాష్ట్రంలో మహిళలు అభివృద్ధి చెంది వారి కుటుంబాన్ని వారే పోషించుకునే విధంగా ఉండాలని సిఎం జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని బద్వేలు ఎమ్మెల్యే సుధా, ఎమ్మెల్సీ డిసి.గోవిందరెడ్డి పేర్కొన్నారు. గురువారం వెలుగు పథకం ఆధ్వర్యంలో బద్వేల్ ఏరియా కో-ఆర్డినేటర్ సుబ్బారెడ్డి అధ్యక్షతన జడ్పీ హైస్కూల్ ఆవరణంలో ఆసరా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు పెట్టి వారి బ్యాంకు ఖాతాలోనే డైరెక్ట్‌గా నిధులు జమ చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రమణారెడ్డి, ఎంపిడిఓ ముజఫర్ రహీం, ఎసి సుబ్బారెడ్డి, ఎపిఎం వీరాంజనేయులు, వెలుగు సిబ్బంది, మండలంలోని డాక్రా మహిళలు పాల్గొన్నారు

29, 30న జిల్లా స్థాయి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-కడప అర్బన్

ఈ నెల 29, 30న రెండు రోజులు పాటు బద్వేలులో యువజన సంఘం జిల్లా స్థాయి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతుల్లో నిరుద్యోగ సమస్యలపై భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీలు మరిచి గాలికి వదిలేశాయన్నారు. సమావేశంలో నగర కార్యదర్శి డి.ఎం.ఓబులేసు, నాయకులు రాజ్ కుమార్, శ్రీను పాల్గొన్నారు.

ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి

కడప అర్బన్: రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాలకు ఏపీపీఎస్సీ గ్రూప్-2, డిఎస్‌సి ద్వారా ఖాళీగా ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి.గంగా సురేష్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని పదేపదే చెప్పి అధికారం చేపట్టిన తర్వాత భర్తీ చేయలేదన్నారు. సమావేశంలో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు దస్తగిరి, సహాయ కార్యదర్శి దేవ రాహుల్ నగర కార్యదర్శి చైతన్య, జిల్లా కార్యవర్గ సభ్యులు శివనాగేంద్ర, బలరాం నాయక్, నగర ఉపాధ్యక్షులు నాగార్జున పాల్గొన్నారు.

ప్రయివేట్ పాఠశాలల్లో ఉచిత విద్య

కడప అర్బన్ : నగరంలోని నిరంజన్ నగర్, శ్రీరామ్ నగర్ రాజీవ్ గాంధీ నగర్ ఏరియాలలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను, తల్లిదండ్రులను కడప మండల సిఆర్‌పిలు ఆదిమూలం శంకర్, బి.వెంకటాద్రి కలిసి వారికి ప్రభుత్వం ప్రయివేటు పాఠశాలల్లో ఉచిత విద్య అందించే విధానాన్ని సవివరంగా తెలియజేశారు. ప్రభుత్వం విద్యాహక్కు చట్టం 2010లోని సెక్షన్ 12 (1) (సి) ప్రకారం ప్రయివేటు పాఠశాలల్లో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలలోని ఐదు నుంచి ఆరు సంవత్సరాల వయసు ఉన్న పిల్లలకు ఒకటవ తరగతిలో 25 శాతం మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రయివేటు అన్ ఎయిడెడ్ స్కూళ్లల్లో 25శాతం సీట్లు రిజర్వు చేయబడ్డాయి. ఈ సదవకాశాన్ని పేద, బడుగు, బలహీన వర్గాల వారు, సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారు, దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు వినియోగించుకొని కోరారు.

'దేశ భవిష్యత్‌లో యువత పాత్ర కీలకం'



విజయ్‌ను సన్మానిస్తున్న రిజిస్ట్రార్

కడప అర్బన్ : సంకల్ప బలం అతి సామాన్యున్ని సైతం శక్తివంతమైన వ్యక్తిగా మారుస్తుందని ఒడిస్సా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ వై.విజయ్ అన్నారు. యోగి వేమన విద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ ఎర్త్ సైన్స్ అడజన్ట్ ఫ్యాకల్టీ హోదాలో ఆయన ఎర్త్ సైన్స్ విభాగాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ భారతదేశంలో 16 నుంచి 30 ఏళ్ల లోపు యువత అధిక శాతం మంది ఉన్నారని పేర్కొన్నారు. వీరంతా నైపుణ్యత గల వారీగా తయారైతే భారతదేశం శక్తివంతమైన దేశంగా మారుతుందన్నారు. మనమంతా విభిన్న కుటుంబాల నుంచి వచ్చామని, పేదరికం, ఆంగ్లంలో పట్టు లేకపోవడం, సబ్జెక్టులో లోతైన అవగాహన లేకపోవడం ఉండి ఉండవచ్చని అయితే ఆశయం ఉన్నతంగా ఉంటే ఇవేవీ ఆటంకాలు కావన్నారు. విద్యార్థులకు పోటి పరీక్షల పట్లసందేహా నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎర్త్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ శివప్రతాప్, ఐక్యూఎసీ సంచాలకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం శర్మ పాల్గొన్నారు. రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్యను విజయ్ మర్యాదపూర్వకంగా కలిశారు. విజయ్‌ను విద్యాలయం తరపున ఘనంగా సత్కరించారు.

నేటి నుంచి దుంపలగట్టు అంకాలమ్మ తిరుణాల

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని దుంపలగట్టు అంకాలమ్మ అమ్మవారి తిరుణాల శుక్రవారం ఘనంగా ప్రారంభం కానుంది. ఆ మేరకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా గురువారం బియ్యపు కొలతతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. అమ్మ వారిని ప్రత్యేక రూపంలో అలంకరించి పూజలు నిర్వహించారు. జిల్లాకే తలమానికమైన దుంపలగట్టు అంకాలమ్మ అమ్మవారి తిరుణాల సందర్భంగా ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించనున్నారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గ్రామస్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.


అంకాలమ్మ అమ్మవారి ఆలయం

'జగనన్నే మా భవిష్యత్తు' హాస్యాస్పదం

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి ప్రభుత్వం చేపట్టిన జగనన్నే మా భవిషత్తు అనే కార్యక్రమం హాస్యాస్పదమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి విమర్శించారు. స్థానికంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు అనే దానికన్నా 'జగనే మా దరిద్రం-జగనే మా శని' అని పేరు పెట్టడం సబబుగా ఉంటుందన్నారు. జగన్ పాలనలో అన్ని వస్తువుల ధరలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మారిందన్నారు. అరాచకంలో ఆఫ్ఘనిస్తాన్, అప్పుల్లో శ్రీలంకను వైసిపి ప్రభుత్వం దాటిపోయిందని విమర్శించారు. జగన్ పాలనలో గన్ కల్చర్, గంజాయి కల్చర్ పెట్రేగి పోయాయన్నారు. లాండ్, శాండ్, వైన్, మైన్స్, ఎర్రచందనం, బియ్యం మాఫియా అధికమైందన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా ఎపి మిగిలిందన్నారు. వరప్రసాదిని పోలవరం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సంజీవిని లాంటి ప్రత్యేకహోదా ఊసేలేదన్నారు. నవరత్నాలు నకిలీ రత్నాలుగా మారినట్లు తెలిపారు. మాట తప్పడం జగన్ దిన చర్య అయిందన్నారు.

అర్హులకు పథకాలు అందేలా చూడాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న ప్రతి పథకం అర్హులకు అందేలా చూడాలని, ఇంటింటికి వెళ్లి జగనన్న పాలన, అభివృద్ధి గురించి వివరించాలని ఎపిఐఎసి రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి సూచించారు. ఆ మేరకు వాలంటీర్లు, గృహ సారధులు ప్రతి ఇంటికెళ్లి వివరించి వారి అనుమతితో స్టిక్కర్లు అతికించాలని తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమానికి సంబంధించి గోడపత్రాలు, స్టిక్కర్లు, కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, నాయకులు జంగిటి శివ, గంగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బిరెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.


కిట్లను అందజేస్తున్న డి.గంగాధర్‌రెడ్డి

'జగనన్నే మా భవిష్యత్తు'ను విజయవంతం చేయాలి

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్నే మా భవిష్యత్తు అనే కార్యక్రమాన్ని గృహ సారథులు, వాలంటీర్లు, గృహ కన్వీనర్లు విజయవంతం చేయాలని మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, సర్పంచు రాచినేని శ్రీనివాసులు, ఎంపిపి లక్ష్మి గాయత్రి కోరారు. స్థానిక 5వ గ్రామ సచివాలయంలో గురువారం జగనన్నే మా భవిష్యత్తు- మా నమ్మకం,, నువ్వే జగనన్న అనే గోడపత్రాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు కటిక చంద్ర, బ్రహ్మయ్య, అంజి, సోషియల్ మీడియా ఇన్‌ఛార్జి గౌస్, అయ్యవారిపల్లె సర్పంచు రామ గంగిరెడ్డి, బికారి, సునీల్, రమేష్‌బాబు, హబీబ్, నాయకులు పాల్గొన్నారు.


గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపిపి, సర్పంచు,

'ప్రతి వార్డులో చలివేంద్రాలు ఏర్పాటు చేద్దాం'

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రతి వార్డులో చలివేంద్రాలు ఏర్పాటు చేద్దామని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, వైఎస్ చైర్మన్ హఫీజ్ పిలుపునిచ్చారు. మున్సిపల్ సభ భవనంలో కమిషనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన గురువారం కౌన్సిలర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు దాహం తీర్చేందుకు ఇప్పటికే కౌన్సిలర్ కిషోర్ మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేశారని తెఇపారు. మిగతా అందరం కూడా చలివేంద్రాలు ఏర్పాటు చేద్దామన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ తప్పనిసరిగా చేయాలని అధికారులకు సూచించారు. పైప్‌లైన్ లీకేజీలను తక్షణమే మరమ్మత్తు చేయించే బాధ్యత మీపై ఉందని అధికారులు సూచించారు. 2024 ఎన్నికల్లో మళ్లీ వైసిపి అత్యధిక మెజార్టీతో గెలుపొందుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వరప్రసాద్

యాచకులు, వృద్ధులకు అన్నం ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు శ్రీవారి సేవా సమితి తరపున యాచకులు, వృద్ధులకు గురువారం అన్నం ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు ఆ సమితి ట్రెజరర్ గుర్రం శ్రీనివాసులు తెలి పారు. పౌర్ణమి సంద ర్భంగా ప్యాకెట్లను అందజేశామన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ అన్నదానం చేయడం వల్ల పుణ్యం వస్తుందన్నారు. శ్రీవారి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతినెల పౌర్ణమి రోజున అన్న ప్రసాద ప్యాకెట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమితి కమిటీ సభ్యులు గంగనబోయిన రాధాకృష్ణ, మల్లెం కొండ సుబ్రమణ్యం, మురారి వంశీకృష్ణ, గ్రందే ప్రభాకర్, కామిశెట్టి సురేష్ బాబు పాల్గొన్నారు.


అన్నం ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న సమితి సభ్యులు

ప్రత్యేక ప్రార్ధనలకు చర్చిలు ముస్తాబు

ప్రజాశక్తి - పోరుమామిళ్ల టౌన్

శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలోని ఆర్‌సిఎం చర్చి, గిరీనగర్‌లోని సిఎస్ఐ చర్చి, మార్కాపురం, బొప్పపురం, పోరుమామిళ్ల కర్మేలు ప్రార్థన మందిరం, టేకురుపేట గ్రామాల చర్చిలు ముస్తాబయ్యాయి. ఆయా చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు.


విద్యుత్ దీపాలంకరణలో చర్చి

దోస పంటకు మంచి డిమాండ్


మైదుకూరు వద్ద జాతీయ రహదారిపై దోసకాయలు విక్రయిస్తున్న రైతులు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని మైదుకూరు, చాపాడు, ఖాజీపేట ప్రాంతాల్లో సాగు చేసిన దోస పంటకు మంచి డిమాండ్ ఉందని రైతులు పేర్కొంటున్నారు. వేసవి సీజన్‌లో రైతులు దోస పంటను ఎనిమిది వందల ఎకరాలకుపైగా సాగు చేశారు. చాపాడు ప్రాంతంలో సాగు చేసిన దోసకాయలను నెల్లూరు, తిరుపతి, గుంటూరు వంటి నగరాలకు ఎగుమతి చేస్తారు. కిలో రూ.20 వరకు ధర పలుకుతోందని రైతులు తెలిపారు. ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేందుకు రవాణా ఖర్చులు అధికమవుతున్నాయని ఆందోలన వ్యక్తం చేస్తున్నారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో సరస్వతీపేట, గుంటూరు కొట్టాలు, ఖాజీపేట మండల పరిధిలోని కుమ్మరకొట్టాలు, తిప్పాయపల్లె గ్రామాల వద్ద దోస సాగు అధికంగా ఉంది. ఈ ప్రాంత రైతులు పంటను ఏరోజుకారోజు కడప-కర్నూలు ప్రధాన రహదారిపై కాయలను ఉంచి ప్రయాణికులకు అమ్ముతుంటారు. జాతీయ రహదారి కావడంతో లారీలు, కార్లు, బైక్‌లలో వెళ్లే వారు నేరుగా రైతుల వద్ద దోసకాయలు కొనుగోలు చేస్తున్నారు. వీరి వద్ద కిలోరూ.20 ఉంది. ఇక్కడ కొనుగోలుదారులు ఎక్కువగా ఉంటున్నారు. వీరేకాక ఆ చుట్టుపక్కల గ్రామాల వారు కూడా రైతుల వద్దనే నేరుగా దోసకాయలను కొనుగోలు చేస్తున్నారు. చిరు వ్యాపారులు పెరిగారని రైతులు తెలిపారు. ఎకరా సాగుకు రూ.50 వేలకుపైగా ఖర్చు వస్తుందన్నారు. దిగుబడి ఆశాజనకంగా ఉందని, ధరలు అంతంత మాత్రమేనని తెలిపారు. గతేడాది కంటే కాస్త లాభదాయకంగా ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గర్భిణుల వివరాలు పక్కాగా నమోదు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలో గర్భిణుల వివరాలు పక్కాగా నమోదు చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ తెలిపారు. స్థానిక పిహెచ్‌సిలో గురువారం ఆయన అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో నమోదు చేసిన, ఆరోగ్య సిబ్బంది నమోదు చేసిన గర్భిణుల సంఖ్యలో తేడా వస్తున్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారన్నారు. ఇకపై రెండు రికార్డుల్లో తేడా ఉండరాదన్నారు. టీకాలు అందేలా చూడాలని వారికి సూచించారు. ఐసిడిఎస్ సిడిపిఒ సావిత్రి మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ ఓబులేష్, సిహెచ్ఒ రాముడు, హెల్త్ సూపర్‌వైజర్ సరస్వతి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ, రాజ్యలక్ష్మి, క్లస్టర్ పర్యవేక్షకులు భాస్కర్, రమేష్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎంఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండాపురం : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.సుజాత ఆధ్వర్యంలో మండలస్థాయి ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా తాళ్ళప్రొద్దుటూరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రెహనా, ఐసిడిఎస్ సిడిపిఒ ముంతాజ్ బేగం, మండల నోడల్ ఆఫీసర్ రాజా రత్నం పాల్గొన్నారు. మాతా శిశు సంరక్షణ ప్రాధాన్యత గురించి వారు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ బాల నరసింహులు, పిహెచ్ఎన్ కళావతి, సూపర్ వైజర్ (ఐసిడిఎస్) భారతి, సుశీల రాణి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.


చాపాడు : మాట్లాడుతున్న మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్

వేతనం ఇప్పించాలని ఆర్‌టిపిపి ఉద్యోగుల వినతి


సిఇకి వినతి పత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

తమకు మార్చి నెల వేతనం అందేలా చూడాలని మండలంలోని రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (ఆర్‌టిపిపి) ఉద్యోగులు కోరారు. ఆ మేరకు గురువారం వారు చీఫ్ ఇంజనీర్ మురళీకృష్ణకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఎపి పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నుపూస సుబ్బారెడ్డి మాట్లాడుతూ శుక్రవారం నుండి వరుసగా మూడు రోజులపాటు బ్యాంకులకు, ఎపి జెన్‌కో కార్యాలయాలకు సెలవులు వచ్చాయని, ఏప్రిల్ 10వ తేదీ వరకు వేతనాలు అందకపోతే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి ఎపి జెన్‌కో టాప్ మేనేజ్‌మెంట్‌తో మాట్లాడి మార్చి నెల వేతనాలు జమ అయ్యేలా చూడాలని సిఇని కోరారు. ఏప్రిల్ 6వ తేదీ వచ్చినా వేతనాలు ఇవ్వలేదన్నారు. వేతనాలు ఆలస్యమైతే కిందిస్థాయి ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల చదువులు, ఆరోగ్య సమస్యలు, కుటుంబ పోషణ వంటి అనేక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రతినెల 1వ తేదీ వేతనాలు ఇవ్వాలని సిఇ మురళీకృష్ణను కోరారు. ఉద్యోగులు బ్యాంక్‌ల్లో ఇంటి రుణాలు, వ్యక్తిగత, చదువు, వాహన రుణాలు తీసుకున్నారని వివరించారు. కార్యక్రమలో ఎపి పవర్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు హరి ఓబుల్‌రెడ్డి, ఎస్‌జి శేఖర్, ఎం నరసింహులు, ఎ అబ్దుల్ హమీద్, పి గిరిబాబు, గంగయ్య పాల్గొన్నారు.

ఇంటి ముందే వైద్యం.. అదే జగన్ లక్ష్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఇంటి ముందే గ్రామీణ ప్రజలకు ఉచిత వైద్య సేవలందించడం సిఎం జగన్ లక్ష్యమని ఎంపిపి శేఖర్ యాదవ్ తెలిపారు. కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గోపవరం విలేజ్ క్లినిక్ వద్ద గురువారం జరిగిన ఫ్యామిలీ పిజీషియన్ విధానం అధికారిక ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పేదలకు అందుబాటులోకి వైద్యం తేవడం ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం లక్ష్యమన్నారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ ఈ విధానం పేదప్రజలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు మోషే, ఉప సర్పంచు రాఘవేంద్రరెడ్డి, ఎంపిటిసి దస్తగిరిరెడ్డి, వైద్యాధికారులు హనీఫ్ బాబా, శ్రీనివాస్, సుబ్రమణ్యం, సిహెచ్ఒ కృష్ణమ్మ, హెచ్ఇ శోభరాణి, సూపర్‌వైజర్ బిఎ వరప్రసాద్, చంద్రకళ, ఒఇ మహేష్, ఆరోగ్య సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

బి.కోడూరు : సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు ప్రారంభమయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికి వైద్య సేవలు అందించే కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. మండలంలో 104 వాహన సేవలు ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ మల్లేశ్వరి

సిపిఆర్‌పై అవగాహన అవసరం : జెవివి


సిపిఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జెవివి ప్రతినిధులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రజలందరికి సిపిఆర్‌పై అవగాహన అవసరమని జనవిజ్ఞాన వేదిక ఆరోగ్య విభాగం కన్వీనర్ డాక్టర్ కాల్వ విజయ్‌నాగేంద్ర తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం మైదుకూరు రోడ్డులోని రాణి తిరుమలదేవి డిగ్రీ కళాశాలలో జెవివి ఆధ్వర్యంలో 'మనిషి స్పృహ కోల్పోయినప్పుడు ఏమి చేయాలి' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపల్ చంద్రశేఖర్ అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్‌నాగేంద్ర మాట్లాడుతూ ఆకస్మాత్తుగా కానీ, ప్రమాదవశాత్తూకానీ మనిషి స్పృహ కోల్పోతే మనం ఆ మనిషికి సిపిఆర్‌ని ప్రథమ చికిత్స చేయడం ద్వారా ఆ వ్యక్తిని కాపాడవచ్చునన్నారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ అందరికీ ఆరోగ్యం అనే నినాదపు లక్ష్యం నెరవేరాలంటే ప్రాథమిక ఆరోగ్యంపై దృష్టి సారించాలని తెలిపారు. సిపిఆర్‌పై అందరికీ అవగాహన ఉండడం కీలకమన్నారు. అనంతరం విద్యార్థులకు సిపిఆర్‌పై డెమో, ప్రాక్టికల్ నాలెడ్జ్‌ని ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ తరునేందు శేఖర్, జెవివి జిల్లా ఆరోగ్య విభాగం కన్వీనర్ డాక్టర్ చక్రధర్, జిల్లా ఉపాధ్యక్షుడు పోలంకి శ్రీరాములు, జిల్లా నాయకులు మురళీగుప్త, శర్వాణి, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవం.. సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని పునరావాస కాలనీలు ఓబన్నపేట, సీతాపురం, చౌటిపల్లెలో చైత్రమాసం పౌర్ణమి సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని వేదపండితులు మంగళవాయిద్యాలతో వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు కుల మతాలకు అతీతంగా కుటుంబ సమేతంగా ప్రజలు విచ్చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అల్పాహారం, భోజనాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం మేళతాళాలు, భజన బృందాలతో ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు.

నారా లోకేష్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి అనంతపురం జిల్లాలో సాగుతున్న యువ గళం పాదయాత్రలో గురువారం నారా లోకేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా జమ్మల మడుగు నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిస్థితి గురించి లోకేష్‌కు వివరించామని నారాయణరెడ్డి తెలిపారు. నారా లోకేష్‌తో కలిసి పాదయాత్రలో కొంతవరకు పాల్గొన్నానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జమ్మలమడుగు టిడిపి నాయకులు పాల్గొన్నారు.


లోకేష్‌తో దేవగుడి నారాయణరెడ్డి

పౌష్టికాహారం అందజేత


ఆహారం అందజేస్తున్న సంస్థ సభ్యులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వట్టణంలోని పెన్షనర్స్ భవనంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విశ్రాంత ఎఇ సుబ్బరాయుడు కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో గురువారం ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌష్టికాహారం, మందులు క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మానవతా చైర్మన్ కొండారెడ్డి, ట్రెజరర్ హరిశ్చంద్రారెడ్డి, మానవతా సభ్యులు గోపాల్‌రెడ్డి, గంగిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, వెంగల్‌రెడ్డి, అశ్వర్థ నారాయణరెడ్డి, నారాయణరెడ్డి, సదాశివారెడ్డి పాల్గొన్నారు.

15 వరకు కెసి కెనాల్‌కు నీరు

ప్రజాశక్తి - చాపాడు

కెసి కెనాల్‌కు ఈనె 15 వరకు నీటిని విడుదల చేస్తామని అధికారులు ఒక ప్రకటన తెలిపారు. కెసి ఆయకట్టు పరిధిలో ప్రస్తుతం ఆరుతడి పంటలు, వరి పంటలో ఉందన్నారు. ప్రస్తుతం పంటలు వివిధ దశల్లో ఉండడంతో రైతుల వినతి మేరకు మరో 10 రోజుల పాటు నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో ఆగస్టు రెండో వారంలో నీటిని విడుదల చేయడంతో వరి పంటను సాగు చేశారు. మెదట మార్చి చివరి వరకు నీరు విడుదల చేస్తామని చెప్పినప్పటికీ నూగు, దోస వంటి ఆరుతడి పంటలు వివిధ దశలో ఉండడంతో చివరి తడి కోసం నీటిని 15 వరకు విడుదల చేస్తున్నట్లు తెలుస్తోంది. కెసి కెనాల్ పరిధిలో 5 వేల ఎకరాల్లో పలు పంటలు సాగులో ఉన్నాయి.


కెసి కెనాల్‌లో ప్రవహిస్తున్న నీరు

వైఎస్ఆర్ ఆర్‌ఒ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మండల పరిధిలోని మోటునూతలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఒ ప్లాంట్‌ను గురువారం వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. పాడా నిధులతో గ్రామీణ ప్రాంత ప్రజలకు తాగునీరు వాటర్ ప్లాంట్ అందుబాటులోకి రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపిపి సౌజన్య, వైసిపి సీనియర్ నాయకులు బాల గంగిరెడ్డి, కొప్పాల సూర్యనారాయణ, పార్టీ యూత్ కన్వీనర్ వేణుగోపాల్ యాదవ్, జయకుమార్ పాల్గొన్నారు.


ఆర్‌ఒ ప్లాంట్ ప్రారంభిస్తున్న వైఎస్ భాస్కర్‌రెడ్డి

తేక్వాండో పోటీల్లో ఎస్‌విడిసి సత్తా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక శ్రీ కృష్ణ గీతాశ్రమంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు తేక్వాండో పోటీల్లో సత్తా చాటరని కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరి నారాయణ తెలిపారు. గురువారం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కో-ఆర్డినేటర్ గౌరీశంకర్, తేక్వాండో శిక్షకుడు శ్రీనివాసులు అభినం దించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లా డుతూ తమ కళాశాల విద్యా ర్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి పురస్కార పంట పండిస్తున్నారన్నారు. తాజాగా ఇటీవల మలేషియాలో జరిగిన అంతర్జాతీయ స్థాయి పోటీల్లో తలబడ్డారని, ఇందులో తమ కళాశాల విద్యార్థులు రుద్రసేనారెడ్డి, బెన్హర వరప్రసాద్, యగ్నేష్ రెండు బంగారం పతకాలు, ఒక వెండి, మూడు బ్రౌంజ్ పతకాలు సొంతం చేసుకున్నారన్నారు. తమ కళాశాల విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తూ కళాశాల ప్రగతి పథంలో నడిపిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను అభినందించారు.


విద్యార్థులతో ఎస్‌వి డిసి కళాశాల యాజమాన్యం

ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు వేగవంతం చేసేందుకు సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఓఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని సభ భవనంలో గురువారం ఆయన ప్రజాప్రతినిధులు, సచివాలయం సిబ్బందితో ఇంటి నిర్మాణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఓఎస్‌డి మాట్లాడుతూ పునాదులు వేయాని లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఇళ్లులేని వారందరికీ ఇంటి కల నెరవేర్చాలనేదే సిఎం జగన్ ఆశయమన్నారు. జగనన్న కాలనీల్లో కనీస వసతులు కూడా కల్పిస్తామన్నారు. ఇంటి నిర్మాణాలపై ప్రతిరోజూ ప్రత్యేకశ్రద్ధ పెట్టాలని సూచించారు. అనుకున్న లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం ఉండరాదన్నారు. వేంపల్లె పంచాయతీ పరిధిలోని ఆయా జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలు సరిగ్గా జరగడం లేదన్నారు. వార్డు మెంబర్లు, ఎంపిటిసిలు కూడా సహకరించాలని సూచించారు. సమావేశంలో ఎంపిపి లక్ష్మి గాయత్రి, మండల స్పెషల్ ఆఫీసర్ రవీంద్రారెడ్డి, ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, హౌసింగ్ ఎఇ సుకుమార్‌రెడ్డి, గ్రామ సచివాలయ ఇంజనీర్లు, కార్యదర్శులు, వార్డు మెంబర్లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.


ఇంటి నిర్మాణాలపై సమీక్షిస్తున్న ఓఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి